# మామయ్యే దైవం



భమిడిపాటి
రామగోపాలం

బుధవారం ఒచ్చింది........

బుధవారం వారానికోమాటు ఒస్తూనే వుంది. అం౨తో ఆశ్చర్యమేమీ లేదు. కాని ఈ బుధవారం రావడం నాకెందుకో భయం, ఆశ్చర్యం పుట్టిస్తూనేవుంది ....

పంచమీ బుధవారం మంచిదమ్మా, ఆవేళ మామయ్యకి సమాధానం రాస్తాను. ఈలోపున నువ్వాలోచించుకోవచ్చు.... అన్నారు నాన్న. ఆయనకి నివార..నాడు.

ఆ ప్రశ్న ఝుంఝూమారుతంలా

ఎప్పుడు ఎవరి నోటంట హఠాత్తుగా ఊడిపడుతుందో చెప్పలేం. కాని ఎలాగో ఒకలాగ మూడుగంటల్లోపున ఉత్తరం వెళ్ళిపోవాలి. ఎవరో ఒకరు అడిగి తీరుతారు. అందరూ నాకు పెద్దలే. అందరూ నన్ను అడిగేవాళ్ళే....నన్నెవరూ లోకువగా చూడ్డంలేదు. కాని నాకేమిటి ఇలా భయంగా వుంది.

మామయ్యంటే నీ కిష్టమేనా ?–మామయ్యని పెళ్లి చేసుకోడానికి నీ కంగీకారమేనా?–ఇదీ ప్రశ్న.

యాభై రెండేళ్ళ మామయ్య.... మామయ్య కూతుళ్ళు యిదరు నాకంటే పెద్దవాళ్ళు కాపరాలు చేసుకుని పిల్లల తల్లు లయ్యారు. మామయ్య పెదకొడుకు నాకంటే ఏడాది చిన్న—అమెరికాలో చదువుకి వెళ్లాడు. అక్కణ్ణించే ఆరుగురు ఉన్నారు. ఆఖరిదానికి రెండేళ్లు. దాని పురట్లోనే అత్తకి కేన్సర్ ఉందన్న సంగతి బైట పడింది తీసుకుని. తీసుకుని చాలా డబ్బు ఖర్చుపెట్టించేసి, ఆర్నెల్లక్రితం వెళ్ళిపోయింది. రెండేళ్ళ పాప. నాలుగేళ్ళ బాబూ, ఆరేళ్ళపాప అమ్మా అమ్మా అంటూ హృదయ విదారకంగా ఆక్రందనలు చేస్తున్నారు. నేనూ ఎరుగుదును. అత్త పోయిందని వైరాస్తే వెళ్ళి వెళ్లాళ్ళున్నాన....

ఊళ్ళన్నీ వెతికేరట–మామయ్యకి ఓపిల్లకోసం ఆ పిల్లలకోమారుటి తల్లి కోసం.........ఎవరూ ఇస్తామనలేదు గాబోలు....ఎవరో అన్నారుట. చంకలో పిల్లని పెట్టుకుని వీధులన్నీ వెతుకుతారేం ఆయన బావమరదిగారమ్మాయే ఉండగా.. పైగా ఆ అమ్మాయిదగ్గిర పిల్లలందరికీ


వెలువడింది !

ఆంధ్రదేశంలోని డిటెక్టివ్ సాహితీ ప్రియులకు నూతనసంవత్సరకానుక!

రోహిణి రచన

డిటెక్టివ్

కాశ్యప కేసు నెం 1

ఇదివరకెన్నడూ మీరూహించికూడా యుండని కవరు డిజైనుతో, వైటు గ్లేజ్డ్ ప్రింటింగు పేపరుపై చదవడానికి సులువైన ముద్రణతో, 1/8 క్రౌన్ సైజులో 100 పేజీలకు పైగా అడుగడుగునా ఉత్సుకతను రేకెత్తించే కథాసంవిధానంతో, ఉత్తమశ్రేణి అపరాధ పరిశోధన విలువలలో, వినూత్న పంథాలో రచింపబడినవల

వెల రూపాయి

ఇరవయి అయిదు పైసలు మాత్రమే

మార్చినెలలో మరో రచన

డిటెక్టివ్

కాశ్యప కేసు నెం 2

ఏజంట్లకు 25% కమిషను ఇవ్వబడును. ఐదు కాపీలకన్నా తక్కువ ఏజన్సీ ఇవ్వబడదు. కమిషన్ మినహాయించుకొని మిగిలిన సొమ్ము అడ్వాన్సుగా పంపవలెను. లేక వి.పి ద్వారానైనా పంపబడగలవు. వెంటనే కాపీలకై వ్రాయండి. మేనేజర్:

వి. ఆర్. పబ్లికేషన్సు,

3-6-259, హిమాయత్‌నగర్ చౌరస్తా

హైదరాబాద్-29.

చనువుకూడానూ.... పెద్దలు ఈవిధంగా చేస్తే బాగుంటుందన్నారు; మరి మీ అభిప్రాయం - ముఖ్యంగా అన్నపూర్ణ అభిప్రాయం ఏమిటో వ్రాయించకోరుతున్నాను - అంటూ మామయ్య ఉత్తరం రాశాడు.

మామయ్యంటే నా కిష్టమే, కాదని ఎలా అనగలను! ఎంత యిష్టం అంటే మా నాన్నంటే ఎంతిష్టమో అంత! స్వయానా మా మేనత్తమొగుడూ, మరి! ఏ పండక్కి వెళ్ళినా చిన్నప్పట్నుంచీ కూడా, గౌన్లనాడు గౌన్లూ, వోణీలూ పరికిణీలనాడు అవీ, చీరలనాడు చీరలూ వాళ్ళ పిల్లల్తో సమంగా పెడుతూనే వున్నాడు! చిన్నప్పుడే ఏమిటి, ఇప్పుడు వాళ్ళ పిల్లలకన్నా బాగా చూసుకుంటాడు. ఉహూ.... పిల్లలందరూ ఒదినా అనడం అలవాటు.... ఎలాగో శ్రమపడి పిన్నీ అనడం అలవాటు చేసుకుంటారు- ఒక మనిషికోసం యింకోరు ఆమాత్రం మారలేకపోతే ఎలాగ!

మామయ్యంటే నా కిష్టమే. ఆ మాట చెప్పడానికే శనివారంనుంచీ బుధవారం వరకూ వ్యవధి యిచ్చారు. నాకు మామయ్యంటే ఇష్టముండడానికి కారణాలన్నీ వెతుక్కొని పోగుచేసుకుని అవే మనసుకి నచ్చచెప్పుకొని. అవును మామయ్యంటే నా కిష్టమే అని వొక్క మాట చెప్పేస్తే చాలును. పెళ్ళి పదిహేను రోజుల్లో జరిగిపోతుంది.

* * *

గడియారం రెండు కొట్టింది. హాల్లో ఈజీచైర్లో పడుకొని శరత్‌బాబు వ్రాసిన నవల చదువుకుంటున్నాను. కథానాయిక నిజంగా కష్టాలు పడుతోంది. కాని ఆదర్శవాది కాబోలు రచయిత, ఆమె కళ్యాణంతో కథ ముగించాడు.... వల్ల పిల్లకి పెళ్ళైంది-అందరికీ అయింది.... వాళ్ళ చుట్టూ ఎవరో మొగవాళ్ళు ఆకర్షణకో, ఆదర్శానికో లోబడి కథానాయకులనిపించుకున్నారు. వారు అలాంటి నిజమైన ప్రపంచంలో ఎవ్వరూ కనిపించలేదు. ఇరవై ఏళ్ళుంటి, గ్రాడ్యుయేట్ అయిపోయి సినిమాకి వెళ్ళొచ్చి చెప్పకుండా వెళ్ళినందుకు రెండురోజులు తల్లి చేత చీవాట్లుతిన్న కథానాయకు డొకడూ, వీశ చక్కెర తెమ్మంటే వీశకీ డబ్బులిచ్చేసి అరవీశపొట్లాం పట్టుకొచ్చేసి తండ్రిచేతా ఒదినగారిచేతా తిట్లుతిన్న కథానాయకుడొకడూ, మా యింట్లోనే ఉండేవారు; నేను బాగా యెరుగుదును. వాళ్ళకిగాని, మరెవ్వరికీగాని అందంగా పొడుగ్గా ఆరోగ్యంగా స్వచ్ఛంగా ఉండే విద్యావతి అయిన కన్యకోసం, ఆ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకుంటానని మాటవరసకి అని అవమానం పొందడానికైనా ధైర్యం చాలేదు. మగకుర్రవాళ్ళు ఇంత నేలబారు పౌరుషాల్తో తృప్తి చెందిపోవడం దేశానికి చాలా అవమానం. కాని దేశమాత ఎంత అవమానాన్నైనా భరించగల ధైర్యశాలిని.

"పూర్ణ నడక్కుండానే ఉత్తరం రాసేస్తున్నారా, మామగారూ?" అన్నది ఒదిన గదిలో.

"ష్--" నాన్న గొంతు సవరించుకున్నారు. "ఏదీ ఇంకా రాయందే!"

ఈ ఒక్కసారికైనా నా మాట వినండి. పూర్ణ నడక్కుండా మాత్రం.

ఏదో పంచమీ బుధవారం వెళ్ళిపోతోందనీ పోష్టు కట్టేస్తారు కదా అని తొం-రపకి ఉత్తరం రాసిపారెయ్యకండి". ఒదిన మెల్లిగా మాట్లాడినా నాకు వినిపిస్తుంది.

"వెళ్ళి అడగవే." అన్నారు నాన్న; అమ్మని కాబోలు.

"మీరే అడగండి. నాకు మొహం చెల్లటంలేదు. దాన్నిచూస్తే గుండె నీరైపోతోంది." "అందరికీ అంతే పాపం! ఇలాంటివడగడానికి ఎవ్వారికీ మొహం చెల్లదు! ఎవరింట్లోనైనా ఓ పావుగంట కూచొనివస్తే, ఇంత సేపూ ఎక్కడచచ్చేవంటూ అందరూ అడగ్గలరు!" ఒదిన వర్ణిస్తుంది, వాదిస్తుంది మామూలుగా ఎప్పుడూ మాట్లాడదు అసలు! ఒదినంటే నాకెంతిష్టమో.

"నువ్వడక్కూడదా తల్లీ. ఇంటి కోడలివికదా ఆమాత్రం బాధ్యత నీకు మాత్రం లేదూ ఇంట్లో."

"నాకా, ఇలాంటివా!? ఛస్తే అడగను. నాకంటే మూడేళ్ళు పెద్దాయన్ని పెళ్ళిచేసుకుని చక్కగా ఆటా పాటా! అచ్చటా ముచ్చటా చేసుకుంటున్న నేను ఆయన చెల్లెల్ని నాకంటే ఓ యేడాది పెద్దదాన్ని ఏమమ్మా, ఓ యాభై రెండేళ్ళబ్బాయి నిన్ను ప్రేమించి పెళ్ళిచేసుకుంటానంటున్నాడు. ఈ అవకాశాన్ని పాడుచేసుకోకుండా పెళ్ళాడరాదా, అని


## శ్రీ విజయదుర్గా డీసెల్ ఇండస్ట్రీస్

(రిజిష్టర్డు) ఫోను నెం. పి. పి. 4188

ఆంధ్ర బ్యాంకు బిల్డింగ్సు

గవర్నర్ పేట :: విజయవాడ 2

**డీసెల్ ఇంజన్ల ఆపరేటర్లకు, మెకానిక్‌లకు శుభవార్త**

మావద్ద ఈ దిగువ ఉదహరించబడిన డీసెల్ ఇంజన్ల పంపులు, పవరు కాలిబ్రేషన్, అరుగుదలలేని పాతనాజిల్సు, రీకండిషనింగ్. ఆధునిక నూతన యంత్రములపై నూతన పరికరములతో అనుభవంగల వారిచే అతినైపుణ్యంగా సకాలంలో అందించగలవారం.

| | | | | | |
|---|---|---|---|---|---|
| మెడోస్ | పెర్కిన్స్ | పెర్గూసన్ | జెటార్ | లిస్టర్ | |
| బెంజి | పోర్డుసన్ | బైలారస్ | పెటర్ | నేషనల్ | డి. టి. 28 |
| లేలెండ్ | డెవిడ్‌బ్రౌన్ | ఉర్సూస్ | పిడ్లీ | డి. టి. 14 | |

దయచేసి ఒకసారి విచ్చేసిన మీకే తెలియగలదు.

ప్రొప్రయిటర్ : దేవినేని రంగారావు.

అడగనా!....ఆ ఉత్తరం కాల్చేసి, ఆ బూడిద ఓ కవర్లోపోసి, చిన్న చీటీ ముక్క రాస్తాను. మహానుభావా! ఇది మీ ఉత్తరం కాల్చిన బూడిద, ఇలాంటి మహద్భాగ్యం నీకెప్పుడు పడుతుందో."

"ఒదినా!"-పెద్దకేక పెట్టేడు.

గదిలో నిశ్శబ్దం ఏర్పడింది.

అమ్మా, నాన్నా పడుతున్న బాధ కళ్ళారా కనబడుతున్నది. మామయ్య పడుతున్న బాధలు మనో నేత్రానికి కనబడుతూనే ఉన్నాయి. నేను పడుతున్న వేదన సరేసరి. ఇన్ని బాధలకీ ఒక్కటే తరుణోపాయం ఉన్నప్పుడు అది మంచవనీ, చెడ్డవనీ అదే నా కర్తవ్యం.

"ఎవరూ అడగక్కర్లేదు నాన్నా. మామయ్యంటే నాకిష్టం లేకపోవడం ఏమిటి! ఇలాంటి క్లిష్ట సమయంలో అతనికి అండగానే నే నిలబడకపోతే ఇంకెవరు నిలబడతారు! పంచమి ఘడియలు దాటిపోకుండా ఉత్తరం రాయండి" అన్నాను గది గుమ్మం దగ్గర నిలబడి.

నా కన్నీళ్ళలొస్తున్నాయి. త్రికరణ శుద్ధిగా చెబుతున్నాను. అవి కేవలం దుఃఖాశ్రువులుకావు. అందులో ఆనందాశ్రువులే ఎక్కువ. త్యాగ దర్పం ఇచ్చిన బలంతో, పెళ్ళిమాట వినగానే ఎంత లోతుకి ఇంకిపోయినా పైకి ఉబికొచ్చే సిగ్గుబలంతో, కఠోరమైన సత్యం ఇచ్చే నీరసంతో, ఇంకా అనేక మిశ్రితభావాల మధ్య, అక్కడ నిలబడలేక పరుగెత్తి కెళ్ళి మేడమీద గదిలో మంచంమీద పడ్డాను.

• • •

పన్నెండేళ్ళ క్రితం, పెద్దన్నయ్య కలకత్తానించొచ్చి, ఈ గదినిండా నా ఫొటోలు నింపాడు.

ఏడాది దాన్నప్పుడు జబ్బల్తో, కండల్తో నేను ఆరోగ్యంగా నవ్వుతూన్నప్పుడు తీసిన ఫొటో.

అయిదేళ్ళప్పుడు బుట్ట చేతుల గౌను తొడుక్కుని, రెండు ముందుజళ్ళేసుకుని గౌను రెండు చెంగులూ రెండు చేతులా పుచ్చుకొని గడుసుతనంగా ముందుకి వొంగిచూస్తున్న ఫొటో.

ఎనిమిదేళ్ళ దాన్నప్పుడు పిచ్చిక గూళ్ళాట లాడుకుంటూ, పరికిణీతో గిర్రున తిరిగి బుట్టలాచేసి కూచున్నప్పటి పెంకెతనపు నవ్వుఫొటో.

పదేళ్ళప్పుడు స్కూలువాళ్ళు మా చేత కృష్ణలీలు నాటకం వేయిస్తే అందరికన్నా పొడుగ్గా వుండిపోయానని నా కిచ్చిన కంసుడివేషంలో ఫొటో.

పన్నెండేళ్ళప్పుడు ఫోర్తుఫారం చదువుతూ, ఆరోఫారంనుంచి నాలుగో ఫారంవరకు ఒక గ్రూపుగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి పొందితే ఆ బహుమతి యిస్తున్న కలెక్టరు సతీసుతో నా ఫొటో.

పదిహేనేళ్ళప్పుడు ఈ ఫొటోలన్నిటితో సమంగా ఇప్పటిదాక టుండాలని ప్రత్యేకంగా తీయించిన దీక్షైన, ధాటైన ఫొటో.

ఇవికాక,

పెద్దన్నయ్యా, చిన్నన్నయ్యా, నేనూ.

అమ్మా, నేనూ,

ఒదినా, నేనూ.

పుష్పలతా, రజనీ, నేనూ.

"ఇంటికి ఒక్కర్తే ఆడపిల్లనని నా ఫొటోలే ఎక్కువ. అవన్నీ అందంగా, మిగతా గ్రూప్ ఫొటోలు అన్నీ వీటి మధ్య దర్జా పొందుతున్నట్లలంకరించి, "ఇవిమాత్రం ఎవ్వరూ కదపకండి, దాని కిష్టమై, దాని మొగుడికి కష్టంకాకపోతే ఇవన్నీ దానికి పెళ్ళైన తర్వాత వాళ్లింటికి నా కానుకగా తీసుకెళ్ళనీండి. లేకపోతే మన యింటి దీపాల్లా ఇవి ఇక్కడుండవలసిందే -అని చెప్పేడు. "ఇంత తెలివైనదానివి. ఇంత చక్కనిదానివి, ఇక్కడిలా ఉండిపోయావేమిటే నాతో కలకత్తా రామ్మా. నిన్ను సరోజినీనాయుడంతటిదాన్నో, తోరుదత్తంతదాన్నో చేస్తాను" అన్నాను.

ఆ ఫొటోలు, ఆ మాటలూ ఇప్పుడిలా ఎటుచూసినా నన్ను చూసి వెక్కిరిస్తూ నవ్వుతున్నాయి.

* * *

చాలామందిలాగే నేనూ పెళ్ళికోసం చదువు మానేశాను. పుష్పలతా, రజనీ, నేనూ విడిపోనిత్రయం. ఆ రోజుల్లో పుష్పలత బాగా చదువుకుని, పెద్ద ఆఫీసరే అయిపోయింది. రజనికి యస్సెస్సెల్సీ చదువుతూండగానే పెళ్లి అయిపోయింది. పరీక్ష లయిపోగానే కాపరానికి వెళ్ళిపోయింది. ఇప్పుడారుగురు పిల్లలు. ఇటు చదువుకోక, అటు పెళ్ళి కాక మిగిలింది నేనే.

ఒచ్చే సంబంధం పోయే సంబంధం. పాతిక, ముప్పై రూపాయలు ఖర్చు చేయించిన పెళ్ళికొడుకుల్ని ఓ నలభై మందిదాకా చూసేరు. ఎవరో ఎక్కడో సంబంధం వుందని రాయడం. నాన్న వెళ్ళి చూసిరావడం, వాళ్ళు ఒస్తామనడం. రావడం. పువ్వులూ, పళ్ళు, టిఫిన్‌లూ, కాఫీలూ - కక్కుర్తి పడ వాళ్ళకి ఇట్నుంచి బస్సుకో, రైలుకో ఛార్జీలూ అంతా మొత్తం ఒక్కొక్క సంబధం పాతిక ముప్పై రూపాయలు. ఫలితం ఎక్కడి గొంగడీ అక్కడే.

పిల్ల నచ్చలేదని కొందరూ, కట్నం చాలదని కొందరూ మానేశారు. మా నాన్నకూడా ఒకటి రెండు సంబంధాలు - కుర్రాళ్ళు మంచివాళ్ళు కారని తిప్పేసిన మాట వాస్తవమే.

* * *

చిన్నన్నయ్య పెళ్లితో నా పెళ్లి అయిపోయిందంటే అయిపోయిందన్నారు. ఒదిన శారద. అందాల బొమ్మ. చదువుల సరస్వతి. 'నాడూ నేడూ కూడా నేనంటే ప్రాణం. అయిదు వేలు కట్నం తెచ్చింది అన్నయ్యకి. వాళ్ళ వేలువిడిచిన చిన్నాన్నగారు, వాళ్ళబ్బాయికి నన్ను చేసుకుంటానన్నారుట. అయిదు వేలు యిచ్చి లాంఛనాలు జరిపిస్తే.

"కొన్ని కారణాలవల్ల" చిన్నన్నయ్య పెళ్ళి అనుకున్నకంటే ఘనంగా జరిపించవలసి వొచ్చింది. డబ్బు దుబారా అయిపోయింది సగం పైగాను.

మిగిలిందానికేదో జతపర్చేరు. నా పెళ్లి కానిద్దాం అనుకున్నారు. ఇంతలో హఠాత్తుగా పెద్దన్నయ్యకు టి. బి. తగిలింది. ఐదుగురు పిల్లల్నీ, అన్నయ్యనీ తీసుకుని పెద్ద ఒదిన దిగింది.... ఎనిమిది నెల్లు రాయవెల్లూర్లో వుండి అన్నయ్యని బాగుచేసుకొచ్చేం.

"దాని పెళ్ళికుంచిన డబ్బు నా జబ్బుకి పెట్టేశారు. దాని పెళ్ళిబాధ్యత నాది, నాతో కలకత్తా పంపండి నాన్నా" అన్నాడు పెద్దన్నయ్య.

కలకత్తాలో పెద్దన్నయ్యగారింట్లో రెండేళ్ళున్నాను.

♦ ♦ ♦

అన్నయ్యకి ఆఫీసులో అసిస్టెంటు రఘునాధరావు, తెలుగువాళ్ళే బెంగాల్లో ఎనభై ఏళ్ళనుంచి ఉంటున్నారట. అన్నయ్యకి అతనంటేకూడా చాలా యిష్టం. అతను రోజూ వస్తూపోతూ ఉండేవారు తెలుగు భాషలో మంచిమంచి పుస్తకాలు నావల్ల విని తెప్పించుకొనేవాడు. అతని ద్వారా నేను బెంగాలీ సాహిత్యం బెంగాలీలో చదవడం నేర్చుకున్నాను.

"నన్ను మీరూ, రఘునాధరావుగారూ అనొద్దు. రఘూ అనండి. లేకపోతే రావ్ అనండి గారు అసలే పనికిరాదు." అన్నాడతను ఒకరోజున....

"ఛా, అతన్ని ఏకవచన ప్రయోగం చేస్తున్నావేమిటమ్మా. అతనికి నిన్నిచ్చి పెళ్లి చేద్దామని ప్రయత్నం చేస్తున్నా" నన్నాడన్నయ్య మరో రోజున.

"నేనెంత చెప్పినా నువ్వు నన్ను ఏమండీ, గారూ అనడం మానలేదేం. మీ అన్నయ్యగారు నాకూ నీకూ మధ్య ఏదో చుట్టరికంకోసం ప్రయత్నించటం నిజమేనా!" అన్నాడతను ఇంకోరోజున హఠాత్తుగా. నేను మాట్లాడలేదు.

"ఏం, తప్పాండీ" అన్నాను కొంత సేపు పోయాక.

"మా నాన్నా, అమ్మా ఒప్పుకుంటే చేసుకోవచ్చు. కాని ఎప్పుడో ఏదో జరుగుతుందని ఇప్పట్నించే మనస్సును దానికి సిద్ధంచేసుకోడం తప్పే."

"అంటే, అలాంటి ఆశలు పెట్టుకోవద్దంటారు!" అన్నాను నవ్వేసి.

"నన్ను పెళ్ళాడ్డంకూడా ఓ ఆశేనా. నీ ఆశలు ఇంత చిన్నవైతే నీ ఆచరణలింకా సన్నగిల్లిపోతాయి. ఏదీ, నీ చెయ్యి చూడనీ"—అని సాముద్రికం చూసేవాడిలా నా చెయ్యి అడిగాడు.

"నేను ముందు కుడిచెయ్యి చాపి, మళ్ళీ వెనక్కి లాగేసి. ఎడంచెయ్యి చూపాను."

"నేను రెండు చేతులూ అర్థం చేసుకోగలను"....అన్నాడు రఘు చిరునవ్వుతో.

"కాని—?" అన్నాను గడుసుగా, అల్లరిగా నవ్వుతూ.

"అవును!— మీ ప్రశ్న నా కర్థమైంది....మనస్సు అర్థం చేసుకోలేవా అని కదూ! అంతేనా!" అన్నాడు రఘునాధరావు తనూ పెంకెతనంగా నవ్వుతూ. "మీ మిరపకాయలు చింతపండూ ఉన్నాయే, ఎంతలేసి ఆలోచన్లు రేపుతాయి!"

"అబ్బే లేదండీ. ఇక్కడికి కొచ్చిందగ్గర్నుంచీ పాల ఎరుగుతో చేసిన రసగుల్లాలే తింటున్నానుగా! ఆ ఆలోచన్లు కలగడంలేదసలు!" అన్నాను.

"ఊఁ!—అయితే ఇదన్నమాట!— నా మనస్సు కూడా ఇందులో ఉందా, ఓ అన్నపూర్ణమ్మా! అయినా, నీకిరవై ఏడేళ్ళదాకా పెళ్లి కాదు!" అని నాచెయ్యి వదిలేశాడు రఘు.

"ఇంకా ఇరవై ఏడేళ్ళదాకా!"

అన్నాను చెయ్యి తీసేసుకుంటూ.

"కాదు. నీ వయస్సు ఇరవై ఏడయ్యే వరకూ"

రెండురోజులయ్యాక నేను రఘునాథరావుతో "ఏం సాముద్రికమండీ, మీది! నాకింకో పదిరోజుల్లో పెళ్లి సెటిలయిపోతోంది. మీరేమో ఇరవై ఏడు నలభై అంటూ చెప్పారు!" అన్నాను. అన్నయ్యా, వదిన మాటాడుకున్నదివిని చనువుగా అతన్ని పరిహాసం చేద్దామని ఓవంక సిగ్గుపడుతూకూడానూ.

"ఏదీ? అని అతడు మళ్లీ నాచెయ్యి చూశాడు. "అసంభవం.... ఈ పెళ్లికేదో అంతరాయం కలుగుతుంది. అలా అయితే! — "నిన్ను భగవంతుడు రక్షించుగాక!" అన్నాడతను దిక్కు మొహం వేసుకుని.

సరిగ్గా ఆ నాలుగోరోజున రఘునాథరావు ఒక కారు ఏక్సిడెంట్లో చనిపోయాడు. అతను ఏక్సిడెంట్‌గా చనిపోయాడంటే నాకు నమ్మకంగా ఉండేది కాదు. నామూలంగానే చనిపోయాడనీ, మా అన్నయ్య ఏదో అతను తన అసిస్టెంటుగదా అని చొరవతో అతని తలిదండ్రుల్ని నా వివాహ విషయంలో సంప్రదించాడని, అతని కిష్టమవునో కాదో తెలుసుకోకుండానే వాళ్ళని వొప్పించేడనీ, అతను చెప్పేదీ చేసేదీ ఏం కనిపించక ఆత్మహత్య చేసుకున్నాడనీ అనిపించేది నాకు. బహుశా యువకుల్ని గురించి న్యూనంగా అంచనాలు వెయ్యడంవల్ల అలా అనుకొనేదాన్నేమో తెలియదు. మొత్తంమీద అదీ నా నమ్మకం. అప్పట్నించీ ఆర్నెల్లవరకూ రోజూ కనీసం రెండుసార్లుగా, ఒక్కొక్కప్పుడు ఇరవైసార్లవరకూ నాకు హిస్టీరికీ షాక్స్ వచ్చేవి. ఏపని చేస్తున్నా అతను జ్ఞాపకం రాగానే హఠాత్తుగా స్పృహ తప్పేది. గుండెలు బాదుకోవడం, జుట్టు పీక్కోడం, పట్టుకున్నవాళ్ళని ఈడ్చిపారెయ్యడం-ఇవీ లక్షణాలు తాళంచెవులు గుప్పెట్లో పెడితే షాక్ కొంతతగ్గి కొంతసేపట్లో తెలివివచ్చేదని చెబుతూ ఉండేవారు. నాకేమీ తెలియదు. భగవంతుడు నిన్ను రక్షించుగాక! అని అతనంటూన్నట్టే ఉండేది ఎప్పుడూనూ.

"ఇక్కడుంటే నీ కతను జ్ఞాపకం రాకా మానడు, నీకీ ఫిట్సూ తప్పవు. నిన్ను నాన్నదగ్గరికే పంపించేస్తాను"- అని ఎవరో కలకత్తానుంచి మద్రాసు వెళుతూఉంటే వాళ్ళతోబాటు మెయిలెక్కించేసి రాజమండ్రిలో దింపుకోమని నాన్నకి టెలిగ్రాం ఇచ్చేడు పెద్దన్నయ్య.

ఎక్కడున్నామాత్రం రఘునాథరావు జ్ఞాపకం రాకుండా ఎలా మంటాడు. అతడూ నేనూ పెళ్ళిచేసుకోకపోతే అది వేరే సంగతి ఆ దృష్టితో నేనుచూసిన మొట్టమొదటి మొగవాడు అతనే. ఆఖరివాడుకూడా అతనే!

నేను కలకత్తానించి వచ్చెయ్యడంతో నా పెళ్లిబాధ్యత అన్నయ్యనుంచి తప్పిపోయి మళ్ళీ నాన్నకే విధించబడింది.

* * *

నీకంటే ఓ యాడాది చిన్నవాడయిపోయాడు నాకొడుకు. లేకపోతే నిన్ను వాడకి చేసుకుందును తల్లీ! అనేది అత్త. కోడలిగా వెళ్ళవలసిన యింటికి అత్తగారుగా, వొదినిగా వెళ్ళవలసిన

యింటికి సవతితల్లిగా వెళుతున్నాను.... మా మయ్య నాన్న ఉత్తరం చదివి ఏమను కుంటారో. ఏమనుకుంటారు!—పిల్ల ఒప్పుకుందని తెలుసుకొని ఏ మొగవా డైనా ఏమైనా అనుకుంటున్నాడా ఏమిటి! అదేదో సహజమైన చర్యగా, తప్పక జరగవలసిన నిర్ణయంగా భావిస్తాడేమో. పైగా తనవల్ల నా కన్యత్వానికి విముక్తి కలుగుతూందని గర్విస్తున్నాడేమో. రఘునాధరావు చెప్పినట్లు నా కిరవై ఏడేళ్లు వెళ్ళాయి కదా! నా కన్యత్వానికి విముక్తి కలగజేసే పుణ్యం ఆయనదే. ఈ పెళ్ళి తప్పి పోదు.

కాగితం కలం తీశాను. మా మయ్యకి నేనొక ఉత్తరం వ్రాయాలి. తనపిల్లల దిక్కులేనిస్థితి చూసి అమ్మా, అమ్మా అని ఆ ఆఖరు ముగ్గురు పిల్లలూ చేసే ఆక్రందనలూ, పడే బాధలు అర్థంచేసు కుని ఈ నిర్ణయానికి రావడం జరిగింది గాని, ఇందులో నాకోసం తనకోసం ఏమీలేదు. ఈ వివాహంవల్ల నాకేమీ సంసారసుఖం అక్కర్లేదు. నన్ను కన్యగా మరణించనివ్వాలి. నాకు నా కన్యత్వం బరువుగా లేదు. దానికి విముక్తి వద్దు.

• * •

శుక్రవారం ఉత్తరాలందుకుని, శని వారం మనిషిని పంపేడు మామయ్య. అందర్నీ వచ్చెయ్యమనీ, పెళ్ళికక్కడే ఏర్పాట్లు చెయ్యొచ్చని డబ్బూ, మను షులూ, ఇల్లూ అన్నీ మాట్లాడిపెట్టి సిద్ధంగా ఉన్నాయని ఇంట్లోనూ, వీధి లోనూ అంతా తలోమాటా అనుకు న్నారు. ఇంత ఆసికూడదని ఒకరూ, అతనవస్త అలావుందని ఒకరూ, పిల్లల వస్తగాని అతనవస్తాయని యింకోరూ, ఆ మాటకొస్తే మన అవస్తమాటేమిటని మరొకరూ—ఏదెలా వున్నా మాటిచ్చాం కనుక మనమైనా వేరేవిధంగా డబ్బూ అవీ సర్దుకోలేం కనక, వెళ్ళితీరవలసిందే నన్నారు అన్నయ్య మినహా అందరూ బయలుదేరేం. అన్నయ్యచేసే ఏర్పాట్లూ నాన్నపెట్టే పెట్టుబడీ, భగవంతుడు చూపించే దయా, అన్నీ మామయ్యే మీద వేసుకున్నాడు. నా కింక అన్నీ ఆయనే.

• • •

పదిహేను రోజుల్లో ముహూర్తం ఉందిట. అందుకని అన్నీ హడావిడిగా జరపవలసొస్తోంది. ఛ! రెండో పెళ్ళికింత ఆర్భాటమా! ముప్పయేళ్ళ కాపరాన్ని మూడు నిముషాల్లో మర్చిపోయి మళ్ళీ ఇంత తతంగంతో, ఇంత సన్నాహంతో పెళ్ళిచేసుకుండికీ, వీళ్లైతే కట్నంకూడా పుచ్చేసుకుండికీ ఈ దేశస్థులది బుద్ధి కాదు, బురద అనిపించింది.

మేం వెళ్ళిన మూడురోజులకు వదిన లిద్దరూ వచ్చారు. ఆ మర్నాడు అమె రికానుంచి సరాసరి సుధాకర్ వచ్చాడు. అతనొచ్చేటప్పటికి నేను మా కేర్పాటు చేసిన యింట్లో కాక, వాళ్ళ యింట్లో ఒదినలతో ఏదో మాట్లాడుతూవున్నాను.

సుధాకర్ని నేను పోల్చుకోలేకపో యాను. అతడు మొదట్నుంచీ పొడగరే అయినా, సన్నంగా ఉండేవాడు. పాత ఆకారంతో పోలిస్తే లావెక్కాడనాలి.

"ఏమిటక్కా యిదంతాను! ఈపంది రేమిటి, ఈ హడావిడేమిటి! ఓహో.

పూర్ణాదినకూడా యిక్కడే వుండే. ఇదంతా ఏమిటి ఈ అట్టహాసం?"

"నువ్వొస్తావని, నీకు స్వాగతం!" అన్నాను నేను.

"థేంక్స్. కాని మీకెలా తెలుసు?- పేపర్లో చదివారా!"

"పేపర్లో చదవడ మేమిట్రా? నువ్వొస్తావని వైరొచ్చిందన్నారునాన్న" అందొదిన.

"అది సరే, స్వాగతం అంటేనూ, నేను కాలిఫోర్నియా యూనివర్శిటీ ఫస్టు వచ్చానక్కా. పైగా రికార్డు స్థాపించేను. అప్పుడు వివరంగా ఉత్తరం రాసిననాటికి తెలీదు. నేను దార్లో వుండగా తెలిసింది. అది తెలుసేమో, పేపర్లో చదివేరేమో అనుకున్నాను - పూర్ణాదిన స్వాగతం అంటే స్వాగతమే, సన్మానమే అనుకున్నాను" అన్నాడుసుధాకర్ ప్రగల్భంగా.

"సన్మానంకాదు —— కళ్యాణం!" అందొదిన నవ్వుతెచ్చుకుని తల్లిపోయిన తరువాత వాళ్ళు కలుసుకోడం యిదే మొదటిసారి. దుఃఖ వాతావరణం రాలేనందుకు కష్టంగాఉంది. అయినా ఒదిన దృష్టితో ఆలోచిస్తే ఏ కల్యాణ సమయంలోనూ ఎవరూ కంటతడి పెట్టడానికి వీల్లేదు.

"ఎవరిది - పూర్ణాదినదేనా? మనింట్లో చేస్తున్నారా? అలా చెప్పు. కంగ్రాచ్యులేషన్స్ ఒదినా - సరిగ్గా సమయానికి రావడం నా అదృష్టం - ఎవూరిస్తున్నారు అన్నా?"

"ఏవూరేమిట్రా - నాన్నే చేసుకుంటూన్నంటేను!".... క్షణంలో సుధాకర్ మతిపోయినవాళ్ళా అయిపోయాడు

"నాన్నా!!.... మన నాన్నా!? పూర్ణాదిన్నా? రెండో పెళ్ళి చేసుకుంటున్నాడా? నిజం?—అందరూ ఒప్పేసుకున్నారా? నువ్వు. నువ్వు -? నువ్వుకూడా ఒప్పుకున్నావా?" నావేపు తీక్ష్ణంగా చూస్తూ వేలు చూపిస్తూ అన్నాడు.

మామయ్యొచ్చాడు.

"ఏరా, సామాన్లన్నీ వచ్చినట్టేనా?" అని ఏదో అడుగుతున్నాడు.

"సుధాకర్ పులిలా అటు తిరిగాడు. అదికాదు నాన్నా, నువ్వు - పూర్ణాదిన్ని - పెళ్ళిచేసుకుంటున్నావా? ఈ పందిళ్లూ అవీ అందుకేనా? మామయ్య అడుగుతేమాత్రం! నువ్వెలా ఒప్పుకున్నావు నాన్నా! ఒక వంటలక్కని పెట్టి మరో యాభై ఎక్కువ పారేస్తే సంసారం చక్కదిద్దకపోయేవా పిల్లల్ని కిక్కురుమనకుండా కూచోబెట్టకపోయేదా!- ఈమాత్రం భాగ్యానికి ఒదిన బ్రతుకంతా పాడుచెయ్యడం దేనికి!.... ఇలా జరగడానికి వీల్లేదు నాన్నా!"

"నేను ద్వారందాటి లోపలికెళ్ళి నిలబడ్డాను. తలుపు సగంతెరిచి, అక్కడ్నుంచి చూస్తున్నాను దిగ్భ్రాంతురాలినై?

"అది కాదురా" మామయ్య నింపాదిగా అన్నాడు ఓటమి కనబడుతోంది.

"నాకు తెలుసు నాన్నా. అమ్మ పోయిందగ్గర్నుంచీ మామయ్య ఒకటే విధంగా నిన్ను అడుగుతూ కూచుని వుంటాడు. ఇంట్లో పిల్ల ఎదిగిపోయింది. చంటిపిల్లలు పూర్ణదగ్గిర చనువుగా ఉంటారు. దానికి కిన్నె చెర వొదిల్చినట్టూ వీళ్ళకి ఇంత అన్నం నీళ్ళు కూడి

ర్చినట్టూ అవుతుంది పెళ్ళికి సరే అన మని!—నువ్వు సరేఅనుంటావు అంతేగా."

మామయ్య నిష్పృహగా "ఎవరంటే నేంకేరా, మొత్తంమీద ఏదో నిశ్చయం జరిగింది" అన్నాడు.

"నీ నిశ్చయాలూ గిశ్చయాలూ తీసి అవతల పారెయ్యి నాన్నా. నేనిలాంటిది జరగడానికి ఎంతమాత్రం ఒప్పుకోను— ఇది చాలా అన్యాయం....సమయాని కొచ్చాను లేకపోతే ఘోరం జరిగి పోయేది"........

"ముందు ఇంట్లోకి పద తమ్ముడూ అంది ఒదిన; సుధాకర్ జెబ్బపట్టుకొని.

"ఇంట్లోకి వెళ్ళమ్మనే అక్కా!— ఇదేదో తేలనీ. అదికాదు నాన్నా! పూర్ణాదినమీద అంత అభిమానంవుంటే ఏదేనా మంచి సంబంధం చూడాలి. కాకపోతే కట్నంకింద ఐదో పదోవేలు ఖర్చుపెట్టాలి. అంతేగాని అదా, దాని గొంతుక అడ్డంగా కోసెయ్యడమేనా?"

"సరేలే, తరవాత మాట్లాడదాం. ముందు నువ్వు స్నానంగట్రా చేసి ప్రయాణం బడలిక పోగొట్టుకో — నా కవతల పనుంది"....అని మామయ్య మొహం చిన్నబోయింది

"నాన్న ఇంత అర్థంలేనిపని తల పెట్టగా ఎన్నడూ చూళ్ళేదక్కా—" అన్నాడు సుధాకర్ ఇంట్లోకి రాగానే.

"ఏది అర్థంలేనిపనో, ఏది పరమార్థంవున్నపనో ఎవరికి తెలుసు?— ఒకరికి చెడ్డ అనిపించిం దింకొకరికి మంచి కావచ్చు." అన్నాను వాళ్లు లోపలకి రాగానే.

"సుభ నావేపు చూశాను. థేంక్స్! మా వ్యవహారాలు మేం పరిష్కరించుకో గలం. నీ జోక్యం అనవసరం అన్నాడు చిన్నప్పుడు అలిగిన ధోరణిలో, బుంగ మూతి పెట్టుకుని.

"అదిగాదు తమ్ముడూ జయా, రవణా, శశి వీళ్ళ ముగ్గురికీ అమ్మ తరువాత ఒదినదగ్గరే చనువు — వాళ్ళకోసం నాన్న—"

"వాళ్ళకోసం నాన్న పెళ్ళి చేసుకో వాలేం—రమ్మను! ఇలాంటి పిల్లల్ని ఇంకో నలుగుర్ని!—ఇలా బుజాలమీద పెట్టి ఆడించి పెంచుతాను—చూస్తానుగా, ఈ పెళ్ళి ఎలా జరుగుతుందోనూ!"

◆ ◆ ◆

మూడురోజులు శాంతిలేదు. సుధాకర్ గొడవ చేసేస్తున్నాడు. తనబిడ్డవాళ్ళందరితోనూ వాదనే. అనుకున్న పని ఎక్కడ ఏ క్షణంలో ఆగిపోతుందో, మళ్ళీ యథామూషిక మూషికః అన్నట్టు యేం వచ్చినవాళ్ళం వచ్చినట్టుగా రాజమండ్రి వెళ్లిపోవలసి వస్తుందేమో అని అమ్మా నాన్నా కుమిలిపోయారు. నిశ్చయంజరిగిన పెళ్లి చెడిపోడంకంటే కన్యకు అవమానం లేదు. ఇందులో ధనం, వయస్సు వీటి ప్రమేయం లేదు.

సుధాకరేమో సంబంధాలు చూస్తానంటున్నాడు....

"వీళ్ళందరూ ఇంత చూసేరు, ఈయన మూసి వెడతాడింక!" అని మూతి విరుస్తున్నారు జనం.

"పోనీ ఏ పదహారు పదిహేడేళ్ళ పిల్లో అయితే ఒకటిగాదు; పది సంబంధాలు చూడవచ్చు; అందులో ఒకటి ఏరుకోనూవచ్చు. ఈడుమించినపిల్ల.

రెండో పెళ్ళి సంబంధం దొరకడమే కష్టమై పోయిందికద! మనలో మాట; ఆవిడ చచ్చిపోకపోతే ఇది మాత్రం ఏదో—"

"అయినా పెద్దవాళ్లు. ఏదో చేస్తున్నారు, మనకెందుకు – అని ఊరుకునే రోజులు పోయాయండీ!"

సుధాకర్ రెచ్చిపోయాడు. "ఏం పెద్దలండీ! బుద్ధిలేని పెద్దలు! మా నాన్నకి ఈ బుద్ధిచెప్పిన పెద్దమనిషి దొరికితే బాగుణ్ణు! తగినట్టు బుద్ధిచెప్పుదును.— ఛీ. ఇలాంటి బుద్ధితేనిపని చేసేకన్న ఆవిడతోబాటు ఈయనకూడా వెళ్లిపోవలసింది!"

"తప్పు నాయనా. అవాచ్యాలు పలక్కు. శుభకార్యంకూడాను."

"ఏది అవాచ్యం! ఇలాంటిపన్లు ఆవాచ్యాలు!"


* *

మర్నాడు పొద్దున్నే వచ్చేశాడు సుధాకర్. మేం ఉన్న యింటికి, "మామా!" అంటూనూ. "మామా! నాదొక చిన్న ప్రపోజల్" – మొహం నిండా నవ్వు తెచ్చుకుని, "ఎవరూ ఏమీ అనుకోకండీ. రాత్రి ఆ సిద్ధాంతిగారు దొరికాడు. ఆయన్ని నాలుగు చీవాట్లువేసి, నాన్నకి పెళ్ళి ఒద్దని, కేన్సిల్ చేయించేశానని చెప్పేశాను. నాన్న ఒప్పుకున్నారు. ఆయన కొవలసింది పిల్లల సౌఖ్యమే నన్నారు. నేను వెంటనే పెళ్లి చేసుకుని, వాళ్లని, రాబోయే ఆవిడా–నేనూ చూసుకుంటాం అని చెప్పాను. నాన్న అందుకూ ఒప్పుకున్నాడు. పూర్ణకి నేను సంబంధం చూసే వరకూ టైం ఉంటుందా, లేకపోతే ఈ ముహూర్తానికే అయిపోవాలంటావా?"

నాన్న తలవంచేశారు.

"బాధపడకు మామా! ఎలాకావాలంటే అలాగే చెయ్యొచ్చును. నాకు

(తరువాయి 83 వ పేజీ)



సుధ. రాత్రి తొమ్మిదయిన తర్వాత యింటికి చేరుకొంది.

ఆ యింట్లో ఎవరూ యిలా సరదాగా షికార్లు కొట్టరు. పిల్లలుమాత్రం అప్పుడప్పుడూ వాళ్ళ నాన్నతో కలసి తిరుగుతూ వుంటారు. ఆరోజు వాళ్ల నాన్న క్యాంప్‌లో వున్నారు. వీళ్ళ పోరు పడలేక సుధతో పంపింది భారతి.

"డాడీతో వెళ్తే యింత బాగుండదు పిన్నీ. ఎంచక్కా నువ్వేం కోప్పడలేదు మమ్మల్ని" అన్నది సుచరిత.

మెల్లగా నవ్వింది సుధ.

"మీరొచ్చి ఎంతసేపయింది తిరిగ్గా కబుర్లు చెప్పుకొంటున్నారు?" అన్నది రాధిక.

"ఇప్పుడే వచ్చాం" అన్నది సునీత.

"హోటల్‌లో బోలెడు తిన్నాం! పిన్నీ ఏంతినలేదు. గాజులు, రిబ్బన్లూ, ముత్యాల దండలూ కొనుక్కున్నాం" అన్నది సుచరిత.

(79 వ పేజీ తరువాయి)

మాత్రం అవతల పిల్ల రెడీగా ఉందా ఏమిటి?–అంతగా ఈ ముహూర్తానికే పెళ్లి అయిపోవాలంటే నేనూ పూర్ణా పెళ్లి చేసుకుంటే సరి."

నాన్నా అమ్మా మొహాలు చూసుకున్నారు.

నేనూ ఒదినా మొహాలు చూసుకున్నాం.

"మరి నీకంటే అది ఏడాది పెద్ద కదరా" అని నసిగారు నాన్న.

"దానికేంలే మామయ్యా ఆమాత్రం పెద్దవడం మంచిదే. నాకంటే పెద్దదైన తమాత్రాన పూర్ణ నాకంటే పొడుగైపోయిందా. నే చెప్పినట్టు వినదంటుందా? నేను వాల్తేరులో చదివినప్పుడు ఇంటావిడ, వంటావిడ అందరూ నాకంటే పెద్దే. మా యింట్లో నాకన్నీ చూసిపెట్టిన అమ్మ, అక్కలూ అందరూ నాకన్న పెద్ద. ఈ మూడేళ్ళూ అమెరికాలో నా కన్నీ అమర్చిపెట్టిన రోజ్ నాకంటే పెద్దది. ఎవ్వరూ నా కెదురు తిరగలేదు. నేనేలాగంటే అలాగ చేసుకొచ్చేరు–అదవాళ్లు పెద్దైతేకూడా ఏం చెయ్యలేరు మామయ్యా. మనం జరుపుకోడంలో ఉంటుంది. ఆ విషయం నా కొదిలై. మిగతా సంగతులు చెప్పండి–"

"మి నాన్నతో మాట్లాడక్కర్లేదుట్రా మరి!" అని నాన్న లేచాడు. సుధాకర్ కూడా లేచాడు.

"నాన్నా! – ఇంకెక్కడి నాన్నా? ఇప్పుడు నాముందు నిల్చి మాట్లాడుతారనుకున్నావా? మాట్లాడితే నువ్వు సమాధానం చెప్పగలవా? అమెరికానుంచొచ్చిన కొడుకు మామయ్యా! కట్నంసంగతేమిటని అడిగాడంటే మీ పనేమౌతుందో చూసొ్కో. అంచేత ప్రస్తుతం నే చెప్పినట్టు చెయ్యండి.... ఇంతకీ పూర్ణా, నీ యిష్టం చెప్పేవేకాదు!" సుధాకర్ నవ్వుతూ నావేపొస్తున్నారు,

నేనేం చెప్పను. నా కింతకంటే కావల్సిందేముంది?.... అదేమిటి సుధాకర్ నా దగ్గిరగా వచ్చేస్తున్నాడు! నాకు సిగ్గు వెయ్యటం మొదలుపెట్టింది. ★

(అమ్మ చెప్పిన కథ ఆధారంగా)